# హాయ్! హాయ్! షాంగ్‌హాయ్!

మన తెనాలిని ఆరోజుల్లో సరదాగా ఆంధ్రా పారిస్ అనేవాళ్ళు అలా అన టానికి పేరే కొన్ని కారణాలున్నాయనుకోండి. 1920-30ల ప్రాంతంలో చైనాలోని షాంగ్‌హాయ్‌కి, పారిస్ ఆఫ్ ది ఈస్ట్ అని పేరు వుండేది షాంగ్‌హాయ్‌లోని నిస్సిన్ షిప్పింగ్ బిల్డింగ్ పైకి ఎక్కితే ఆ రోజుల్లో ఏషియా వాల్‌స్ట్రీట్‌గా పేరుకెక్కిన ఎన్నో ఎత్తైన పాత భవనాలు కనపడతాయి. అక్కడ వున్న హ్వాంగ్పూ నది ఒడ్డుని అప్ప టినించీ ఇప్పటిదాకా బండ్ (ఆనకట్ట) అనే అంటారు. ఆ రోజుల్లో బాంక్‌లతోనూ, ఇతర ఆర్థిక సంబంధమైన ఆఫీసులలోనూ, నాటకాల ఆడిటోరియంలతోనూ, రచ యితల సదస్సులతోనూ, సర్కస్‌లతోనూ నైట్ క్లబ్బులతోనూ కళకళలాడుతూ వుండేదిట. అందుకనే షాంగ్‌హాయ్‌కి, పారిస్ ఆఫ్ ది ఈస్ట్ అనే పేరు వచ్చిందంటా రు. ఆనాడు ఆ ప్రదేశం చాల ప్రపంచ ప్రఖ్యాతమైనదన్నారు.

అంతగా కళకళలాడిన షాంగ్‌హాయ్‌కీ, చైనాకి మొదటినించీ పెద్ద దెబ్బ తగిలింది 1847లో ఫ్రెంచ్ దురాక్రమణ, 1872లో "మొదటి నల్లమందు యుద్ధం" పేరుతో బ్రిటిష్ దురాక్రమణ, దాని తర్వాత 1895లో జపాన్ ఆక్రమణ, అంతర్యు ద్ధాలు, తర్వాత కమ్యూనిస్ట్ విప్లవం, వెంటనే బయటి ప్రపంచంతో తలుపులు మూసివేయటం. కానీ ఆ భవనాలూ, పెద్దపెద్ద భవంతులూ, ఆ నది పక్కనే చరిత్రని గుర్తుకు తెస్తూ అలానే నిలచిపోయాయి.

1978లో చైనా బయటి ప్రపంచానికి మొదటిసారిగా తలుపులు తెరిచింది. వెంటనే చైనాలోని అన్ని ప్రదేశాలకన్నా ముందుగా ఆ మార్పుని అమలుపరిచింది, షాంగ్‌హాయ్. చకచకా ఒక గొప్ప ఆధునిక నగరంగా మారిపోయింది. ఈరోజున షాంగ్‌హాయ్ చూస్తే ఎన్నో ఎత్తైన భవనాలతో కళకళలాడుతుంటుంది. ప్రపంచంలో ఎక్కువ ఆకాశ హర్మ్యాలు వున్న పట్టణం షాంగ్‌హాయ్. ఎక్కువ అంటే ఒక వందో రెండు వందలో అనుకున్నాను కానీ, 5800 పైన అని తెలుసుకున్నాక ఎంతో ఆశ్చర్యమేసింది.

పుడుంగ్‌లోని 420 మీటర్ల ఎత్తైన జిన్‌మావో టవర్, ప్రపంచంలో ఎంతో ఎత్తయిన భవనాలలో మూడవ స్థానంలో వుంది. దానికి కొంచెం దూరంలోనే వుంది, ఓరియంటల్ పెరల్ టీవీ టవర్. చూట్టానికి మూడు కాళ్ళ మీద నుంచున్న ఎంతో పొడుగైన ఇంజక్షన్ సూదిలా ఆకాశంలోకి చొచ్చుకుపోయి కనిపిస్తుంటుంది. ఈ

రెండు భవనాల మీదనించీ హ్వాంగ్పూ నది, దాని పక్కన బండ్ రాత్రి పూట మనో హరంగా కనిపిస్తాయి.

నేను దిగిన షాంగ్రీలా హోటల్ ఇరవ్వయవ అంతస్తులో నిలబడి, షాంగ్‌హాయ్‌లోని ఎత్తైన భవనాలను చూస్తున్నప్పుడే, నాకు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనాలు కూలిపోవటం గురించి వార్త తెలిసింది. అప్పుడే అనిపించింది, మనిషి పైకి ఎదగటానికీ క్రిందకి దిగజారిపోటానికీ వున్న తేడా అల్లా, ప్రేమకీ ద్వేషానికీ మధ్య ఎంత వుందో అంతేనని.

అధునాతన షాంగ్‌హాయ్ పుడుంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఎంతో అందమైనది. పుడుంగ్ అనేది షాంగ్‌హాయ్‌కి ఆనుకునివున్న జంటనగరం. పుడుంగ్ ఇప్పుడు చైనా దేశానికే ఆర్థిక సంబంధమైన విషయాలకి రాజధాని అయింది. బండ్‌కి రెండుపక్కలా ఎన్నో షాపులూ, రెస్టారెంట్లూ, నైట్ క్లబ్బులూ, మ్యూజియంలూ, రంగురంగుల నియాన్ లైట్లతో జిగేల్‌మనిపిస్తాయి.

షాంగ్‌హాయ్ నగర వైశాల్యం ఆరు వేల రెండు వందల చదరపు కిలోమీటర్లు. జనాభా పధ్నాలుగు మిలియన్లు. చలికాలంలో మంచు పడి బాగా చలివేస్తుంది ఎండాకాలంలో 40 సెంటిగ్రేడ్ వేడి. చలికాలంలో చలిగానూ, ఎండాకాలంలో వేడిగానూ, పగటి పూట వెలుతురుగానూ, రాత్రి పూట చీకటిగానూ వుంటుందని చెబుతావేవిటీ అనుకోకండి. అక్కడ వాతావరణంలో తేడాలు చూపిద్దామన్న సదుద్దేశ్యంతో మాత్రమే వ్రాస్తున్నాను.

షాంగ్‌హాయ్‌లో చక్కటి పోర్ట్ వుంది. అక్కడ భూగర్భ రైల్వేలూ, పెద్ద పెద్ద హైవేలూ చాల బాగా కట్టారు. ప్రపంచంలో కల్లా అధునాతనమైన స్టాక్ ఎక్స్చేంజ్ అక్కడే వుంది.

షాంగ్‌హాయ్‌లోవున్న నాలుగు రోజుల్లో నాలుగు చైనీస్ మాటలు కూడా నేర్చుకున్నాను. ముఖ్యంగా అక్కడ అవసరమైన పదాలు రెండు. "నీహానీ" అంటే బాగున్నారా అని. అలాగే "షేషే" అంటే ధన్యవాదాలు అని. అలాగే కొంతమంది పేర్లను ఇంగ్లీష్‌లో వ్రాసుకొని సరిగ్గా పలకటం చాల కష్టం. అప్పుడు నాకు అందుబాటులోకి వచ్చిన భాష మన మాతృభాష తెలుగు.

ఎవరికైనా వాళ్ళ పేర్లని సరిగ్గా పలకకపోతే నచ్చదు. అందులోనూ బిజినెస్ పనిమీదవెళ్ళినప్పుడు సరిగ్గా పలకటం చాల అవసరం. అందుకే అమెరికాలో పేర్లు ఒకటికి రెండుసార్లడిగి మరీ తెలుసుకుంటారు. ఉదాహరణకి Xueyu Qian అనే ఒక పెద్దమనిషి పేరు ఆయన చెబుతున్నప్పుడు నేను తెలుగులో వ్రాసుకుని పలికితే, ఆయన ఆశ్చర్యపోయి, నా పేరు సరిగ్గా పలికే విదేశీయులెవరూ కనపడలేదు మీరు తప్ప అన్నాడు నాతో. ఆయన పేరు తెలుగులో వ్రాసుకుంటే ఎంతో సులభంగా ఇలా వుంటుంది షేయు ఛాన్ అని.

షాంగ్‌హాయ్‌లో చూడవలసినవి చాల వున్నాయి. వాటిలో ముఖ్యంగా చెప్పదగ్గవి, పచ్చలతో (జేడ్) చేసిన బుద్ధుడి గుడి, చైనీస్ గ్రాండ్ థియేటర్, సన్ యట్ సేన్ నివాసగృహం, షాంగ్‌హాయ్ బాంక్, హక్సిన్‌టింగ్ టీ హౌస్. ఈ

హక్సిన్‌టింగ్ టీ హౌస్ గురించి ఒక చిత్రమైన కథ కూడా వుంది. అక్కడికి వెళ్ళ టానికి దారి పాములా వంకరటింకరగా మెలికలు తిరిగి వుంటుంది. భూతాలూ పిశాచాలూ ముక్కుకి సూటిగా వెడతాయనీ, వంకర దారుల్లో వెళ్ళవనీ నమ్మకం. అందుకని అలా వంకర రోడ్డు వేసి, వాళ్ళ కష్టమర్లని వాటి బారినించీ కాపాడుతు న్నామని చెబుతారు. అది విన్నాక కమ్యూనిష్టులకికూడా మూఢ నమ్మకాలున్నా యే అని అనిపించింది. అక్కడ టీ తాగటానికి వచ్చిన ప్రముఖుల్లో, ఎలిజబెత్ రాణి, బిల్ క్లింటన్‌కూడా వున్నారుట.

1079లో కట్టిన హ్యూజో పగోడా, పీసాలోని వాలుతున్న టవర్‌లాటిదే. పీసా టవర్ కన్నా 1.5 డిగ్రీలు ఎక్కువగా వాలిన 19 మీటర్ల ఎత్తు టవర్ అది.

చైనీసేకాక అంతకుముందు ఆక్రమించిన యూరోపియన్లకుకూడా అక్కడ పార్కుల పిచ్చి ఎక్కువ. పూర్వపు రోజుల్లో ఫ్రెంచ్‌టౌన్‌లోని ఫుక్సింగ్ పార్క్ ముందర, "కుక్కలకీ, చైనీయులకీ ప్రవేశం లేదు" అని బోర్డులు వుండేవట.

షాంగ్‌హాయ్‌లో బాగా చెప్పుకో దగ్గవి చైనీస్ మసాజ్ క్లినిక్స్. శరీరంలోని ప్రతి కండరాన్నీ సుతిమెత్తగా ఒత్తుతూ మసాజ్ చేయటంలో చైనీస్ సుప్రసిద్ధులు.కాక పోతే ఎక్కడపడితే అక్కడికి వెళ్ళటం మంచిది కాదు. చాల చోట్ల అవి మసాజ్ క్లిని క్స్ కాదు. సెక్స్ క్లినిక్స్. మేము దిగిన షాంగ్రీలా హోటల్లో, కొంచెం ఖరీదు ఎక్కువ యినా, చక్కటి మసాజ్ చేసే సర్టిఫైడ్ మసాజర్స్ వున్నారు.

చైనాలో చిన్నచిన్న వూళ్ళల్లో చైనీస్ భాష లేలీక కొంచెం ఇబ్బంది పడ్డాం కానీ, షాంగ్‌హాయ్‌లో ఆ సమస్య లేదు. అందరూ చక్కటి ఇంగ్లీష్ మాట్లాడటమే కాక, ఎంతో మర్యాదగా మాట్లాడతారు. వంగి నమస్కారాలు పెడతారు. అక్కడ పెద్ద పెద్ద స్టీల్ ఫాక్టరీలు, టెక్స్‌టైల్ మిల్లులు, పెట్రోల్ రిఫైనరీలు, మెషినరీకంపెనీలు, కెమికల్ ఫాక్టరీలు, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీలు, విమాన భాగాలు తయారు చేసే కంపెనీలు ఎన్నో వున్నాయి. ఊళ్ళో రోడ్ల మీద, ప్రతి చోటా, సైకిళ్ళ మీద వెళ్ళే వాళ్ళకోసం, ప్రత్యేకమైన లైన్లు. ఆఫీసు సమయాల్లో రోడ్ల మీద కొన్ని వేల సైకిళ్ళు చూస్తామక్కడ. కొన్ని సైకిళ్ళకి ముందున్న బుట్టలో పసివాణ్ణి పెట్టుకుని వెళ్ళే తల్లుల్నికూడా చూశానక్కడ.

ఆధునికత మధ్యన మరచిపోలేని చరిత్ర పుటలు. నూతన సాంఘిక వ్యవస్థ లో అంతర్లీనంగా కనిపిస్తున్న ఒక మరువలేని సంప్రదాయ జీవన సరళి. సిరిసంపద స్వప్నాలని నిజం చేస్తున్న పెట్టుబడిదారీ బ్రతుకుల మధ్య హతమయి పోతున్న కమ్యూనిజం. ఇవన్నీ కలిపితే షాంగ్‌హాయ్. చైనా.

ఈనాటి చైనా. అమెరికా, జపాన్, జర్మనీలని ఇప్పటికే ట్రేడ్ డెఫిసెట్‌లో పూర్తిగా ముంచేసిన చైనా.

ప్రపంచ వ్యాపార రంగంలో కాపిటలిస్ట్ దేశాలని మించిపోయిన ఈనాటి కొత్త కాపిటలిస్ట్ చైనా.

*     *     *